క్లుప్తంగా

రేపు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్ల నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి

పులివెందుల టౌన్ : ప్రతి ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని శిల్పారామం సీఈఓ వి.స్వామినాయుడు సిబ్బందికి సూచించారు. గురువారం పట్టణంలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్ వ్యూలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించి అనంతరం మాట్లాడారు. ఉలిమెల్ల లేక్ వ్యూలో సందర్శకుల కోసం ఉచిత రక్షిత తాగునీరు, టికెట్ కౌంటర్‌లో బారీ కేడ్, అక్కడ తాత్కాలిక స్టాఫ్‌కు వారానికి ఒకటి సెలవురు మంజూరు చేశారు. శిల్పారామ ఏఓ సుధాకర్, ఏఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఇస్మాయిల్ సాహెబ్ సుబ్బారావు, వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

పులివెందుల టౌన్ : అధ్యాపకురాలి సేవలు మరువలేనివని కళాశాల పీఆర్‌ఓ బాల నారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర పదవి విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌ఓ హాజరై మాట్లాడుతూ మంచి అధ్యాపకురాలిగా, క్రమశిక్షణకు మారుపేరుగా సుధీర మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదవాలని, వారి సమస్యలను పరిష్కరిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు.

పదవీ విరమణ తప్పదు

పులివెందుల రూరల్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పార్వతి రిటైర్డ్ కావడంతో శుక్రవారం స్థానిక వైఎస్‌ఆర్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆమెకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పులివెందుల వైఎస్‌ఆర్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ నవీన్, ఏడీ మల్లికార్జున, వైద్యులు ప్రత్యూష, శ్రీనివాస్ నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హిటాచి మిషన్ సీజ్

పెండ్లిమర్రి : మండలం కొండూరు రెవిన్యూ పొలం సర్వే నంబర్1 ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమార్కులు భూ ఆక్రమణలకు పాల్పడుతుంటే శుక్రవారం రెవిన్యూ అధికారులు, పోలీసులు దాడులు చేసి ఒక జెసీబీ, ఒక హిటాచి మిషన్ స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తహశీల్దార్ అనురాధ తెలిపారు. ప్రభుత్వ భూములల్లో భూఆక్రమణలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ యు.శ్రీనిత ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ విజ్ఞాన దినోత్సవ వేడుకల శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తొలిసారి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందిన ఘనత సర్ సి.వి.రామన్‌కు దక్కిందన్నారు. పరిశోధనలు చేసి సమాజానికి అవసరమైన వాటిని కనుగొనడం ఎంతో అవసరమన్నారు. వీటి కొరకు విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్ షిప్‌లను ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. ఉపన్యాస, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధీర, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు అపర్ణ, మునిలావణ్యలు హాజరై ప్రాజెక్టులను పరిశీలించారు. స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. అకడమిక్ కో ఆర్డినేటర్ మురళిధర్‌రావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగాయి. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ, శ్రీచైతన్య, శ్రీనివాస, నారాయణ, ఉషాకిరణ్, స్వామి వివేకానంద, ఉర్దూ హైస్కూలులో విజ్ఞాన మేళాను నిర్వహించారు. ప్రదర్శనల్లో పర్యావరణ



వేంపల్లె : సైన్స్ నమూనాను పరిశీలిస్తున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్తా, తదితరులు

పరిరక్షణ, సౌర శక్తి, విద్యుత్ ఉత్పత్తి, రోబోటిక్స్, జల సంరక్షణ, ఆరోగ్య శాస్త్రం, భౌతికశాస్త్ర ప్రయోగాలు, భూగర్భ విశ్లేషణ, భవిష్యత్తు టెక్నాలజీ వంటి అనేక ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థులు పెట్టిన ప్రదర్శనలను పరిశీలించి, వారి ప్రతిభను ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు మెచ్చుకోవడం జరిగింది. భారతీయ శాస్త్రవేత్త, భౌతికశాస్త్ర నోబెల్ విజేత సర్ సి.వి.రామన్ జీవిత విశేషాలను విద్యార్థులకు గుర్తు చేశారు. వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీవీ రామన్ చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు నివాళులర్పించారు.

ట్రిపుల్‌ఐటీలో..

ట్రిపుల్‌ఐటీలో సంచాలకులు ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా, జాతీయ వాతావరణ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌కుమార్‌లు సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలతో నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌కుమార్ ఉపదేశించారు. అలాగే పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి సైన్స్ క్లబ్ ఏర్పాటు చేస్తామన్నారు. ట్రిపుల్‌ఐటీ అకడమిక్ డీన్ రమేష్ కైలాష్, భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ తిలక్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కమలాపురం జడ్పీ హైస్కూల్‌లో ప్రాజెక్ట్స్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎం సరస్వతి

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగాయి. పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి, ఎంఈఓ శివప్రసాద్‌లు పిల్లలు వేసిన బొమ్మలను తిలకించారు. ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలో సృజనాత్మకత పెంపొందితుందన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

జమ్మలమడుగులో..



పులివెందులలో ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ అపర్ణను సన్మానిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు : విద్యార్థులు భవిష్యత్తు శాస్త్రవేత్తలు కావాలనే లక్ష్యంతో శాస్త్ర విజ్ఞానంపై మక్కువ కలిగి ఉండాలని ఎంఈఓ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం సైన్స్ డే సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సాంకేతికపరంగా విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదానం, రేడియన్స్ దస్తగిరి పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలో సైన్స్ సంబరాలు వేడుకలా నిర్వహించారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సైన్స్ డే సంబరాలు నిర్వహించు కున్నారు. ప్రతి పాఠశాలలో సైన్స్‌కు సంబంధించిన ఎగ్జిబిట్స్ విద్యార్థులు స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. పెద్దచెప్పలి జడ్పీ హైస్కూలో విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్, సోలార్ అండ్ విండ్ ఎనర్జీ ప్రాజెక్ట్, జీవ వైవిధ్య వ్యవసాయం తదితర ప్రాజెక్ట్స్‌ను రూపొందించి ప్రదర్శనకు ఉంచారు.

నూతన భవన నిర్మాణానికి విరాళం

పులివెందుల టౌన్ : పట్టణంలోని జగనన్న కాలనీకి వెళ్లే దారిలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి రూ.10వేలు, అలాగే రమణప్ప సత్రం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూ.5వేల నగదును ఆ సంస్థ అధ్యక్షుడు రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి సేవలను విస్తృతం చేసేందుకు ప్రతిఒక్కరు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ

పులివెందుల టౌన్ : పట్టణంలో శుక్రవారం అమృత కలశం పేరిట వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బ్రాహ్మణులు, ఆర్యవైశ్యులు మొత్తం ఐదు కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు దేశ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మేడ రమణయ్య, ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

పులివెందుల టౌన్ : పట్టణంలోని కదిరి రోడ్డులో వెలసిన శ్రీదిన్నెపాటి గంగమ్మతల్లి జాతరకు పూజారి వెంకటనారాయణస్వామి ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తిచేశారు. శనివారం నిర్వహించే ఈ జాతరలో బండలాగుడు పోటీలతో పాటు ఇతర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పన్ను వసూళ్లలో వందశాతం లక్ష్యాన్ని సాధించాలి

ముద్దనూరు : పంచాయతీ పన్ను వసూళ్లలో వందశాతం లక్ష్యాన్ని సాధించాలని డివిజనల్ పంచాయతీ అధికారిణి తిమ్మక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని ముద్దనూరు, యామవరం, చిన్నదుద్యాల పంచాయతీలలో పర్యటించి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 15వ తేదీనాటికి వందశాతం పన్నులు వసూలు చేయాలని, మండలంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. చెత్తనుంచి సంపద కేంద్రాలద్వారా వర్మీ కంపోస్టు తయారు చేయాలని తెలిపారు. అనంతరం డీఎల్‌పీవో ముద్దనూరు పంచాయతీ కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి వీరభద్రుడు, ముద్దనూరు పంచాయతీ ఈవో లక్ష్మీ నరసింహులు పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పూత సమయంలో నీటి తడులు ఇవ్వాలి

చక్రాయపేట : మామిడి తోటల్లో పూత సమయంలో తేలిక పాటి నీటి తడులను తప్పనిసరిగా అందించాలని కేవీకే శాస్త్రవేత్త మానస తెలిపారు. మండలంలోని సురభి గ్రామం రెడ్డివారిపల్లె వద్ద మామిడితోటల్లో సస్యరక్షణ చర్యలపై రైతులకు ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మామిడి పూత విచ్చుకున్నప్పటి నుంచి నీటి తడులు ఇవ్వాలన్నారు. పిందె కట్టిన దశలో రెండవ దఫా ఎరువులను వేయాలన్నారు. తేనె మంచు పురుగు నివారణ కోసం బుప్రోఫిజన్ 1.5 మి.లీ లేదా బుప్రోఫిజిన్ మరియు అసిఫేట్ 1గ్రాము లేదా డైనోటేఫ్యురాన్0.2 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి 3 మి.లీ వేపనూనె జిగురు 0.05 మి.లీ పిచికారి చేయాలన్నారు. తామర పురుగు నివారణకు నీలం రంగు జిగురు అట్టలను చెట్టు మార్చి చెట్టుకు ఒకటి చొప్పున అమర్చాలన్నారు. పూర్తి వివరాలకు అందు బాటులో ఉండే మండల ఉద్యాన అధికారి, వ్యవసాయాధికారిని సంప్రదించి పలు సలహాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రెడ్డెయ్య, వ్యవసాయ అధికారి నవంత్‌బాబు, ఉద్యాన శాఖ సహాయకులు వినోద్, సురేఖ, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు సహరీ సౌకర్యం

వేంపల్లె : రంజాన్ మాసం పురస్కరించుకుని వాహనాల్లో వెళ్లే ముస్లింలకు సహరీ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు బిలాల్ మసీదు కమిటీ సభ్యులు అబ్దుల్, ఫరూక్‌లు తెలిపారు. వేంపల్లెలోని బిడ్డాలమిట్టలో ఉన్న బిలాల్ మసీదు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ముస్లింలకు ఉపవాసం ఉండేందుకు తెల్లవారుజామున మసీదు ఆవరణలో సహరీ దావత్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో కూడా రంజాన్ మాసం ప్రారంభం నుండి సహరీ దావత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేంపల్లె మీదుగా దూర ప్రాంతాలకు తెల్లవారుజామున వెళ్లే ముస్లింలకు సహరీ దావత్‌ను అందజేస్తామన్నారు. వాహనాల్లో వెళ్లే ఉపవాసం ఉండే ముస్లింలు 9885445289, 7207178893 నెంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే వారి వద్దకే వచ్చి సహరీ విందును అందజేస్తామన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళ, వివిధ రకాల పింఛన్లు శనివారం ఉదయం 7 గంటల నుంచి సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. పింఛన్ లబ్ధిదారులు ఇంటి వద్దనే ఉండి పింఛన్ పొందాలని, ఎవరే కానీ సచివాలయం వద్దకు కానీ, ఇతర ఆఫీసుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

క్షయ పూర్తిగా నయమయ్యే వ్యాధి

కమలాపురం : క్షయ వ్యాధి చికిత్స తీసుకుంటే పూర్తిస్థాయిలో నయం అయ్యే వ్యాధి అని జిల్లా అదనపు వైద్యాధికారి రవిబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుడిపాడు హైస్కూల్‌లో క్షయ వ్యాధి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమయ్యే వ్యాధి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధికి సంబంధించిన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి లక్షణాలు, ఈ వ్యాధి బారిన పడితే జరిగే పరిణామాలు, ఈ వ్యాధి ఇతరులకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ సుభాష్ దరియా, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అవకాశం కల్పించండి

వేంపల్లె : ఈనెల 3వ తేదీన విడుదల కానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌లో వచ్చే ఎమ్మెల్సీ ఖాళీలలో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ప్రసాదరావు ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు 21 మంది బ్రాహ్మణులు శాసన సభ, శాసనమండలిలలో సభ్యులుగా ఉండేవారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఉండగా, ఆయా కులాల వ్యక్తులకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఎన్నికల ఖర్చు భరించే స్థితిలో బ్రాహ్మణులు లేనందున ప్రత్యక్ష ఎన్నికలలో ఎవరు పాల్గొనలేక పోతున్నారన్నారు. ప్రస్తుత సభలో బ్రాహ్మణులు ఎవరు లేరని, మేధావి వర్గంగా అందరూ అనబడే కులం ప్రస్తుతం సభలలో ఎక్కడ కనబడటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమయాన్ని, వనరులను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల టౌన్ : ప్రతి విద్యార్థి సమయాన్ని, అందుబాటులో ఉన్న వనరులను అందిపుచ్చుకోవాలని విశ్రాంత జిల్లా ఆరోగ్య, విద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు మానసిక ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్షల సమయంలో అనవసరమైన ఆలోచనలు విడనాడి తగినంత నిద్ర, పోషకాహారాలు తీసుకుంటూ యోగ, ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చునన్నారు. ఈ కార్యక్రమం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, గంగిరెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

అందాన్ని పెంచేవాడు దర్జీ

పులివెందుల టౌన్ : బట్టలు అందంగా మలచి మన అందాన్ని పెంచేవాడు దర్జీ అని రాష్ట్ర వాల్మీకి సంఘ మాజీ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలోని ఉమంతి టైలర్ షాపులో నిర్వహించిన టైలర్స్ దినోత్సవానికి వారు హాజరై విలియమ్స్ హా చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. సాధారణ మానవుని నుంచి రాజకీయ నాయకుడు వరకు దర్జీ వారికి కొలతలు తీసుకుని వారికి నచ్చిన రీతిలో బట్టలు కుట్టి ఇస్తారన్నారు. కాలక్రమేన టెక్నాలజీ పెరగడంతో గుండీలు, కాజాలు వేసేందుకు కూడా మిషన్లు వచ్చాయన్నారు. ప్రభుత్వం దర్జీలను ఆదుకోవాలన్నారు. ప్రొప్రైటర్ నాగిరెడ్డి, అధ్యక్షుడు బాదుల్లా, శివారెడ్డి, టైలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : దర్జీల దినోత్సవం సందర్భంగా స్థానిక నాలుగురోడ్ల కూడలిలో శుక్రవారం టైలర్లు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్జీలు మాట్లాడుతూ రెడీమేడ్ నచ్చని కొంత మంది సీనియర్ సిటీజన్లు మాత్రమే దర్జీలకు పని కల్పిస్తున్నారన్నారు. కుట్టు మిషన్ రుపొందించిన విలియమ్స్ హో పుట్టిన రోజును టైలర్స్ డేగా జరుపుకుంటామన్నారు. గత ప్రభుత్వం టైలర్లకు ప్రతి ఏడాది రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం వచ్చేదన్నారు. ప్రస్తుతం ఆ సాయం కూడా రాలేదన్నారు.



విలియమ్స్ హౌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

ప్రణాళికాబద్ధంగా చదివినప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలరు

వేంపల్లె : విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివినప్పుడే తమ లక్ష్యాన్ని చేరుకోగలరని వేంపల్లె ఆర్య వైశ్య ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) అధ్యక్షుడు బైరిశెట్టి వెంకట సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆవోపా, ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని తలిశెట్టి శేషమ్మ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పదవ తరగతి పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటివేషన్ ట్రైనింగ్, కెరియర్ గైడెన్స్‌లో ఐదేళ్ల అనుభవం కలిగిన వేంపల్లె పట్టణానికి చెందిన మిట్టా శ్రీకాంత్ విద్యార్థులకు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగ్ అధ్యక్షులు పచ్చిపులుసు ప్రవీణ, ఉపాధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి, కార్యవర్గ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

C.K.Plywoods షోరూం నందు పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ / బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. లోకల్ వారికి ప్రాధాన్యత ప్రొద్దుటూరు. సంప్ర: 8919439591

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు – 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693

త్రినేత్ర హోంకేర్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ :18K. , Ph : 8520980099, 8520874499

కడపకు 6 కి.మీ. దూరంలో తోటలో పనిచేయుటకు ఫ్యామిలీతో సహా కావలెను. ట్రాక్టర్ నడుపుట వచ్చిన వారికి ప్రాధాన్యత. Ph: 8247584286

కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియాలోని మా సంస్థ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటల డ్యూటీ. జీతం: 13,000+ESI, PF. సంప్రదించండి సెల్: 7287917477, 9182964173.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి

9705907418
9705944423
9010223797
9010072409

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి



విజేతలతో ముఖ్య అతిథులు, సీవీ రామన్ సైన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని జిల్లా విద్యాధికారి షంషుద్దీన్ తెలిపారు. స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రగతి పరుగులు తీయడంతో సైన్స్ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని, భావ వ్యక్తీకరణ పెంపొందించుకోవాలని తెలిపారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సైన్స్ మానవ వికాసానికి దోహదపడాలే నీ వినాశనానికి దారి తీయకూడదన్నారు. సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత ఆలోచనలను కలిగి ఉండాలన్నారు. అనంతరం నిర్వహించిన పలు పోటీల్లో విజేతలను ప్రకటించారు. సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీషు మీడియంలో దినేశ్వర్ రెడ్డి(జెడ్పీహెచ్ఎస్, కల్లూరు), అష్రఫ్ (మున్సిపల్ ఉర్దూ హైస్కూల్, మోడంపల్లి), విష్ణువర్ధన్ (జెడ్పీహెచ్ఎస్ బాయ్స్, వేంపల్లె), తెలుగు మీడియంలో ఎస్.లిఖిత(జెడ్పీహెచ్ఎస్, చిన్నకొమ్మెర్ల), రూప(ఎస్ఆర్ఎంహెచ్, ప్రొద్దుటూరు), హరిణ మాధురి (ఎస్ఆర్ఎంహెచ్, ప్రొద్దుటూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విశ్రాంత ఎంఈవో పరమేశ్వరయ్య, రమణమహర్షి హైస్కూల్ పూర్వ విద్యార్థులు అందించిన బహుమతులను క్లాస్-1 కాంట్రాక్టర్ కృష్ణార్జునరెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, వంశీకృష్ణ, అల్లాబకాష్, సుబ్బానాయుడు, గోపీనాథ్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు

జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్ : కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే.. పోలీస్ శాఖ గుర్తుంచుకుంటుందని ఎస్పీ ఇ.జి.అశోక్ కుమార్ అన్నారు. స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పదవీ విరమణ పొందిన ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ ఏఎస్ఐ వి.గోపాల్, కడప టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఓ.చంద్రగుప్తుడులను ఎస్పీ శుక్రవారం ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన తర్వాత విశ్రాంత జీవితాన్ని కుటుంబంతో ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా చూస్తామన్నారు. ఎలాంటి సమస్యనైనా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐ టైటస్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ ఈ.జి.అశోక్‌కుమార్

ఇంటింటా రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

పులివెందుల టౌన్ : ఇంటింటా రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లన్నారు. పట్టణంలోని న్యాక్ బిల్డింగ్ సమీపంలోని బియ్యం గోదామును శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు వివరాలు, తూనికలు, రికార్డులను ఆమె పరిశీలించారు. పంపిణీ చేసే బియ్యం సరిగా లేకపోవడంతో తిరిగి పంపాలని ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ నాగరాజుకు తెలియజేశారు. పులివెందుల పట్టణంలో బియ్యం పంపిణీ జరగడంలేదని విలేకరులు అడగ్గా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్‌ను ఆరా తీశారు. డీఎస్ఓ, ఏఎస్ఓలను పంపి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఐవీఆర్ఎస్ సర్వేలో అవకతవకలు జరిగినట్లు తెలిసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దారు నజీర్ అహమ్మద్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

వినతులను పరిష్కరించాలి

సింహాద్రిపురం : ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని జేసీ అధికారులకు సూచించారు. సింహాద్రిపురం రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలకు అధికారులు తయారు చేసిన ఫైల్స్‌ను పరిశీలించారు. తహసీల్దారు నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో జైలు శిక్ష

వేంపల్లె : అత్యాచారం కేసులో ఓ ముద్దాయికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొమ్మద్ది గంగయ్య రోజు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కూలి పనులకు వెళ్లిన సమయంలో మతిస్థిమితం లేని అతడి భార్యపై అదే గ్రామానికి చెందిన శివ నారాయణ అత్యాచారం చేశాడు. బాధితురాలి భర్త గంగయ్య ఫిర్యాదు మేరకు 2023 జూన్‌లో కేసు నమోదు చేశారు. శుక్రవారం కడప మహిళ కోర్టులో సాక్షులు చెప్పిన మాటలు నిరూపణ కావడంతో ముద్దాయి శివ నారాయణకు జడ్జి రమేష్‌కుమార్ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బైక్ మెకానిక్ ముసుగులో చోరీలు

– రూ.8లక్షల విలువైన 18 మోటార్ సైకిళ్ల స్వాధీనం

కడప అర్బన్ : మోటార్ సైకిల్ మెకానిక్ ముసుగులో వచ్చి బైక్‌లు దోచుకెళ్తున్న దొంగకు పోలీసులు చెక్ పెట్టారు. నిందితుడిని అరెస్టు చేసి రూ.8 లక్షల విలువైన 18 మోటారు సైకిళ్లను రికవరీ చేశారు. కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రామకృష్ణ వివరాలు వెల్లడించారు. ఇటీవల మోటారు సైకిళ్ల చోరీలు పెరగడంతో ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు.. సీఐ, ఎస్ఐలు నిఘా పెట్టారు. అనుమానితులను విచారించి.. కడప రవీంద్ర నగర్‌కు చెందిన వేల్పుల నరేంద్ర అలియాస్ మహేంద్రను నిందితుడిగా గుర్తించారు. శుక్రవారం మహేంద్రను అరెస్టు చేసి అతడి నుంచి 18 మోటార్‌సైకిళ్లను రికవరీ చేశారు.

పోలీస్ వలయంలో మాలెపాడు

ఎర్రగుంట్ల : కత్తులతో వ్యక్తిపై దాడి నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామమైన మాలెపాడు గ్రామస్తులకు టెన్షన్ మొదలైంది. ముందస్తు జాగ్రత్తగా కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, ఇద్దరు ఎస్ఐలు, పలువురు పోలీసులు శుక్రవారం గ్రామంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎర్రగుంట్ల మండలంలోని మాలెపాడు గ్రామం మొత్తంగా పోలీసుల వలయంలో ఉండిపోయింది. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోనే జగనన్న కాలనీలో మాలెపాడు గ్రామానికి చెందిన మేకల ప్రసాద్‌రెడ్డిపై ఐదుగురు కత్తులతో శుక్రవారం దాడి చేశారు. మట్టి తవ్వకం వ్యవహారంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణే కారణమని స్థానికులు భావిస్తున్నారు.

సైబర్ బాధితులకు సత్వర న్యాయం

కడప అర్బన్ : సైబర్ నేరాల్లో బాధితులకు సత్వర న్యాయం అందిస్తామని డీ ఎస్పీ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఎ.మధుమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పాలతల క్షేత్రంలో సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మహిళలను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. చాలామంది ఎవరికి చెప్పుకోవాలో తెలియక మదనపడుతూ, మానసికంగా నలిగిపోతూ, ఆత్మహత్యాయత్నం చేస్తున్నారన్నారు. ఈకెవైసీ, ఆధార్ అప్డేట్, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామంటూ అడిగినా ఓటీపీ చెప్పరాదన్నా రు. అపరిచితుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. నకిలీ వెబ్‌సైట్, బ్యాక్ డోర్ ఉద్యోగ అఫర్లు, ఇ-మెయిల్స్‌కు స్పందించ రాదని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

వక్ఫ్ బిల్లుతో ముస్లింలలో అభద్రతాభావం

కడప కార్పొరేషన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుతో ముస్లిం సమాజంలో అభద్రతాభావం ఏర్పడిందని ఏపీ మైనార్టీ వెల్ఫేర్ ఫెడరేషన్ చైర్మెన్ మహ్మద్ ఇబ్రహీం, సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ అన్నారు. స్థానిక బళ్లారి రోడ్డులోని అల్తాఫ్ ఏజెన్సీస్ వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లిం పూర్వీకులు తమ కష్టార్జితంలో కొంత మసీదులు, మదరసాల నిర్వహణకు ఆస్తులు ఇచ్చారన్నారు. వాటిని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నూతన సవరణలతో బిల్లు ప్రవేశ పెట్టిందన్నారు. వక్ఫ్ ద్వారా మసీదులు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, అనాథాశ్రమాలు, పేదలకు సహాయ నిధులు ఇవ్వగలిగారన్నారు. అనంతరం వక్ఫ్ బోర్డు గూర్చి తెలియజేసే చైతన్య గీతాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ వెల్ఫేర్ ఫెడరేషన్ నాయకులు పవర్ అల్తాఫ్, అష్రఫ్ అలీ ఖాన్, రఫీఖ్ ఖాన్, గౌస్‌పీర్, మగ్బూల్‌బాషా, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

